క్లుప్తంగా

దాతలు ముందుకు రావడం అభినందనీయం



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వరద బాధితులను ఆదుకోవడానికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని అతిథులు తెలిపారు. సౌత్ ఇండియా చారిటబుల్ ట్రస్ట్ అక్షయ పాత్ర, ధ్వని, ఎలైట్ బ్రాహ్మణ్ ఎన్జీవో సంస్థల సహకారంతో వరదల్లో నష్టపోయిన బ్రాహ్మణ కుటుంబాలకు నిత్యావసరాలు పంపిణీ చేశారు. సత్యనారాయణపురంలోని గాయత్రి కన్వెన్షన్ హాల్లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో 300 మంది బ్రాహ్మణ కుటుంబాలకు బియ్యం, నిత్యావసరాల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సాదినేని యామిని పాల్గొన్నారు. కార్యక్రమంలో సత్యనారాయణపురం పురోహితుల సంఘం అధ్యక్షుడు చైతన్యవర్మ, కల్లా నాగిరెడ్డి, కోటిరెడ్డి, బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ముగిసిన లక్ష్మీగణపతి హోమం



విజయవాడ కల్చరల్: శృంగేరీ జగద్గురువులు భారతీ తీర్థమహాస్వామి, ఉత్తరాధికారి విదుశేఖర భారతి స్వామి ఆదేశంతో 25 రోజులుగా నిర్వహిస్తున్న లక్షమోదక లక్ష్మీగణపతి హోమం ఆదివారం ముగిసింది. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పండితులు హవన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం మహాగణపతికి వేదోక్తంగా గణపతిపూజ, గణపతి అథర్వ శీర్షోపనిషత్ పారాయణం, సహస్ర నామార్చన నిర్వహించారు. మోదక పూజ అనంతరం గురువందనం మంత్రపుష్పం, 129 సుగంధ ద్రవ్యాలతో పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో క్షేత్ర ధర్మాధికారి హనుమత్ ప్రసాద్, గండూరి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దు



పాయకాపురం(విజయవాడరూరల్): ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని కళాజాత బృందం సూచించింది. స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఆదివారం 64వ డివిజన్ కండ్రికలో వీఎంసీ కళాజాత బృందం ప్లాస్టిక్ వినియోగం ద్వారా వచ్చే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రదర్శనలు ఇచ్చారు. ప్లాస్టిక్ కవర్లకు బదులు క్లాత్ సంచి, కర్రల సంచి వాడాలని సూచనలు చేశారు. ప్లాస్టిక్ కవర్ మట్టిలో కలిసే గుణం లేదని తెలిపారు. అనంతరం స్థానికులతో కలిసి శానిటరీ ఇన్స్పెక్టర్ గోపీరాజు ప్లాస్టిక్‌ను తరిమి కొడదామని ప్రతిజ్ఞ చేయించారు.

బాధితులందరికీ పరిహారం



పాయకాపురం(విజయవాడరూరల్): వరద బాధితులందరికీ నష్టపరిహారం తప్పకుండా అందజేస్తామని సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు హామీ ఇచ్చారు. న్యూ నవ్యాంధ్ర టు వీలర్ మెకానిక్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఆదివారం కండ్రిక రోడ్డు ప్రాంతంలో వరదల్లో మరమ్మతులకు గురైన మోటార్‌సైకిల్స్‌కు ఉచితంగా మరమ్మతుల కార్యక్రమం చేపట్టారు. ఎమ్మెల్యే బొండా ఉమా, విశ్వబ్రాహ్మణ సంఘం ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గొర్తి శ్రీనివాస చక్రవర్తి ముఖ్య అతిథులుగా విచ్చేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు కడలి ప్రసాద్, ప్రధాన కార్యదర్శి శ్రీనుబాబు, గౌరవ అధ్యక్షుడు రంగబాబు పలువురు మెకానిక్స్ పాల్గొన్నారు.

వరద బాధితులకు దుస్తుల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదతో సర్వం కోల్పోయిన నిరుపేదలకు ఆదివారం అయోధ్యనగర్ ఇందిరా ఎన్‌క్లేవ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, శరత్‌చంద్ర మాట్లాడుతూ వరదల కారణంగా కట్టుబట్టలతో మిగిలిన నిరుపేదలకు దుస్తులు అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ నేతలు వేణుగోపాల్ రాజు, సాంబశివ రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పోయే దారేది!



వినాయకనగర్‌లో నిలిచిన నీరు



దావు బుచ్చయ్యకాలనీలో..

- కానరాని కాలువలు
- వరద నీటిలో మురుగు
- ఎండాల్సిందే 1500 కుటుంబాలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): పేరు గొప్ప.. ఊరు దిబ్బ అన్నచందాన కొన్నికాలనీల పరిస్థితి కనిపిస్తోంది. ఇది తెలియాలంటే 30వ డివిజన్ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకగనర్ ప్రాంతాలకు వెళ్లాల్సిందే. ఇక్కడ స్థలాల ధరలు, అభివృద్ధి చెందిన ప్రాంతాలకు ధీటుగా ఉన్నాయి. కానీ మౌలిక సదుపాయాలు మాత్రం కానరావడం లేదు. కనీస అవసరాలైన రోడ్లు, మురుగుకాలువలు, తాగునీరు, డ్రైనేజీ వసతి అంతంత మాత్రంగానే ఉన్నాయి. ఇక్కడ ప్రభుత్వ రిజిస్ట్రేషన్ ధర అధికంగా ఉండటంతో ఎక్కువ పన్నులు చెల్లించాల్సి వస్తుంది. లక్షలాది రూపాయల వ్యయంతో స్థలాలు కొనుగోలు చేసి వేలాది రూపాయల పన్నులను చెల్లిస్తున్నా ఇక్కడ సౌకర్యాలు మాత్రం అరకొరగా ఉన్నాయి. ముఖ్యంగా ఈ ప్రాంతాల్లో ఇళ్లు కట్టుకోవాలంటే లక్షలాది రూపాయలను ప్లాన్‌లకు చెల్లిస్తున్నారు. అనధికారికంగా లక్షలాది రూపాయలను అధికారులకు సమర్పించుకుంటున్నారని తెలుస్తోంది. అయినా ఇక్కడ వసతులను మాత్రం కల్పించడం లేదు.

ఖాళీ స్థలాల్లోకి

ఇక్కడ వాడిన మురుగునీరు బయటకు పోయే దారి లేదు. ఎవరికి వారు ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు వదలివేస్తున్నారు. దీంతో ఇవి చెరువులను తలపిస్తున్నాయి. మురుగునీరు నిలిచిపోవడంతో దోమలకు ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. కొద్దిపాటి వర్షానికే వర్షం నీరు, మురుగు రోడ్ల పైకి చేరుతుండటంతో రాకపోకలకు నానా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మురుగు నిలిచి దుర్వాసన, అంటువ్యాధులతో అల్లాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

నిలువెత్తు నిర్లక్ష్యం

బుడమేరు వరదల సమయంలో పురపాలక శాఖ మంత్రి నారాయణ, నగర కమిషనర్ వరద ప్రాంతాల్లో నిలిచిన వరద నీటిని మోటార్ల ద్వారా తొలగిస్తామని హామీ ఇచ్చారు. కానీ ఇక్కడ మాత్రం కనీసం వచ్చి చూసిన వారు కానీ మోటారు పెట్టిన వారు కానీ లేరు. వరద వచ్చి సుమారు నెల రోజులు కావస్తున్నా ఇంకానీరు నిలిచే ఉంది. వరద నీటిని తొలగించే కనీస ప్రయత్నం చేయడం లేదని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ ప్రాంతాలపై దృష్టి సారించి మురుగునీరు నిలిచిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతవాసులకు 'మానవత' సాయం



విద్యార్థులకు నగదు ప్రోత్సహకాలు అందజేసిన మానవత సేవా సంస్థ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు ముంపు ప్రాంత బాధితులకు మానవత సేవా సంస్థ సాయం అందించింది. ఆదివారం బందరు లాకుల సమీపంలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో సంస్థ సర్వసభ్య సమావేశం జరిగింది. వరద బాధితులకు నిత్యావసర సరుకులు, బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన మున్సిపల్ పాఠశాలల విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు, ప్రశంసాపత్రాలను అందజేశారు. ఎంకేబేగ్, కేర్ అండ్ షేర్, బీవీ సుబ్బారెడ్డి పాఠశాలలకు చెందిన 10 మంది విద్యార్థులకు ప్రోత్సాహక నగదు అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి రూ.2వేలు, రూ.1500, రూ. వెయ్యి చొప్పున నగదు అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ చైర్మన్ పొట్లూరి వీర శేషగిరిరావు, అధ్యక్షుడువులూరి సాంబశివరావు, కార్యదర్శి పి.ము, ప్రతినిధులు ల్గొన్నారు.

వరద బాధితుల సంఖ్యను కుదించడం సరికాదు

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు



బాధితులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబూరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వరదల్లో అపారనష్టం సంభవించిందని, ప్రభుత్వం బాధితుల సంఖ్యను కుదించి పరిమితంగా పరిహారం అందించడం తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబూరావు హితవు పలికారు. బాధితుల గుర్తింపులో లోపభూయిష్టంగా ఉన్న నిబంధనలు మార్చాలన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ఆదివారం అజిత్‌సింగ్‌నగర్, న్యూ రాజరాజేశ్వరి పేట ప్రాంతాల్లో పర్యటించారు. వరదలో మృతి చెందిన ముఠా కార్మికుడు పోలినాయుడు కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దసరా ఉత్సవాల పేరుతో యంత్రాంగం వరద బాధితులను నిర్లక్ష్యం చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. పండుగకు ముందే బాధితులందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు కలెక్టరేట్ కేంద్రంగా ప్రజా ఫిర్యాదులు పరిష్కరించాలని చెప్పారు. వరదలు సంభవించి 29 రోజులు గడుస్తున్నా కేంద్ర ప్రభుత్వం వరద సాయం ఎందుకు అందించడం లేదని ప్రశ్నించారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం మౌనం వహించడం సరికాదన్నారు. వరద బాధితుల సహాయంపై ప్రత్యేకంగా యంత్రాంగాన్ని కేటాయించాలన్నారు. ముఖ్యమంత్రి.. కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్ష చేయాలని కోరారు. అన్ని రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాలు, బాధితులతో అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన సహాయం, విధివిధానాల్లో మార్పులు చేయాలని, ప్రస్తుత ప్రకటించిన సాయం రెట్టింపు చేయాలని డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. పర్యటనలో సీపీఎం నేతలు బి.రమణారావు, టి.శ్రీనివాస్, రాము, రాజులమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘాట్‌రోడ్డులో పాము కలకలం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గగుడి ఘాట్‌రోడ్డులో ఆదివారం పాము కనిపించడంతో అక్కడ పనులు చేస్తున్న కార్మికులు భయాందోళనలకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, ఇతర అధికారులు దసరా ఏర్పాట్లను పర్యవేక్షించే సమయంలో పాము కనిపించడంతో ఆలయ సిబ్బంది అప్రమత్తమయ్యారు. కొంత కాలంగా ఘాట్‌రోడ్డులో భక్తుల రాకపోకలు నిలిపివేయడం, అభివృద్ధి పనులు జరుగుతుండటంతో కొండపై నుంచి వచ్చి ఉంటుందని ఆలయ అధికారులు పేర్కొంటున్నారు.

రీ ఎన్యూమరేషన్ చేయండి

- వరదతో మునిగిపోయిన ఇంటికి రూ.50వేలు, ఆటోలకు రూ.25వేలు ఇవ్వాలి
- ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ధర్నా



అలంకార్ సెంటర్‌లో ధర్నా చేస్తున్న ఇఫ్టూ, సీఐటీయూ నేతలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరదల్లో ప్రజలకు తీవ్ర నష్టం జరిగిందని, ప్రభుత్వ నామమాత్రపు పరిహారం ప్రకటించిందని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) రాష్ట్ర అధ్యక్షుడు పి.ప్రసాద్ అన్నారు. అది కూడా సక్రమంగా అందడం లేదని పేర్కొన్నారు. వరద ముంపు ప్రాంతాల్లో రీ వెరిఫికేషన్ చేయాలని డిమాండ్ చేశారు. ఆదివారం అలంకార్ సెంటర్‌లోని ధర్నాచౌక్‌లో ఇఫ్టూ ఆధ్వర్యంలో వరద పరిహారం రెట్టింపు చేయాలని కోరుతూ ధర్నా జరిగింది. ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వమే 2.87 లక్షల ఇళ్లు వరదలో మునిగిపోయాయని, వరద నష్టం రూ.6,800 కోట్లుగా అంచనా వేసిందన్నారు. కానీ పరిహారం చెల్లింపులో కేవలం రూ. 600 కోట్లతో సరిపుచ్చడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. అందులోనూ దాతలే రూ. 400 కోట్లు ఇచ్చారని చెప్పారు. దాతలు ఇచ్చిన విరాళాలకు ప్రభుత్వం నామమాత్రంగా జోడించి చేతులు దులుపుకుందన్నారు. ఇది అత్యంత దుర్మార్గమని విమర్శించారు. ఎన్యూమరేషన్‌కు ఇతర జిల్లాల అధికారులను కేటాయించి పథకం ప్రకారం లబ్ధిదారులను కుదించిందన్నారు. ఇళ్లు, ఆటోలు మునిగిపోయి కార్మికులు జీవనాధారం కోల్పోయారన్నారు. ఆటోలను అన్నింటినీ నమోదు చేయలేదని, చేసినా నో రిపేర్ అని రాసి పరిహారం ఇవ్వడం లేదని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే తిరిగి వరద బాధితుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. బాధితులందరికీ పరిహారం పెంచి ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ సీ హెచ్ శ్రీనివాస్, ఏఐసీటీయూ నాయకులు ఎస్‌డీ సలీం మాట్లాడుతూ నష్టపోయిన ప్రతి ఆటోకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బుడమేరు వరదల్లో మునిగిపోయిన ఇళ్లకు రూ.50 వేలు, ఆటోలకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) డిమాండ్ చేసింది. ధర్నాలో ప్రగతిశీల ఆటో కార్మిక సంఘం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు, ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు ముని శంకర్, ప్రధాన కార్యదర్శి ఎ.రవిచంద్ర, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, ఆటో సంఘం నాయకులు కె.దుర్గారావు, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

'బెస్ట్ టీచర్ అవార్డు'కు దరఖాస్తుల ఆహ్వానం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వరల్డ్ టీచర్స్ డే పురస్కరించుకుని ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యాన అత్యుత్తమ క్రమశిక్షణతో ఉత్తమ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను గుర్తించి బెస్ట్ టీచర్ ఇంటర్నేషనల్ అవార్డ్‌- 2024తో సత్కరించనున్నట్లు అకాడమీ స్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఈఎస్ఎన్ నారాయణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిక చేసిన ఉపాధ్యాయులను వచ్చేనెల 13వ తేదీన హైదరాబాద్‌లో సత్కరించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న ఉపాధ్యాయులు వచ్చేనెల 5వ తేదీలోపు వారు చేసిన సేవలను తెలియజేస్తూ ఆల్‌ది బెస్ట్ సంస్థకు పంపాలని, ఇతర వివరాలకు 96523 47207 నంబర్‌లో సంప్రదించాల్సిందిగా సూచించారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే..

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుత్ తీగల మరమ్మతుల దృష్ట్యా సీతారాంపురం విద్యుత్ సబ్‌స్టేషన్ గీతామందిరం ఫీడర్ పరిధిలో సోమవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. చుట్టుగుంట రైవస్ కాలువ గట్టు, సీతారాంపురం కాలువ గట్టు, లాల్‌బహదూర్ శాస్త్రి వీధి, పాత ఎంప్లాయిమెంట్ ఆఫీస్ రోడ్డు, కాకానినగర్, గీతామందిరం రోడ్డు, మేదర బజారు, కోటిలింగాలవారివీధి, నెహ్రూ స్ట్రీట్, చాపరాల వారి వీధి, ఐనవోలు వారి వీధి, రామా కార్పొరేషన్ ఏరియా, శాతవాహన కాలేజీ వెనుక వైపు, ఐకాన్ పబ్లిక్ స్కూల్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

3 నుంచి శివకామేశ్వరి పీఠంలో శరన్నవరాత్రులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో వచ్చేనెల 3 నుంచి 12వ తేదీ వరకు శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శ్రీధర్మపరిషత్ మహాసంస్థాన్ ఆధ్వర్యాన ఘనంగా నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజూ అమ్మవారికి సుగంధ ద్రవ్య పంచామృత అభిషేకం, అలంకారం, కుంకుమార్చనలు జరుగుతాయని పేర్కొన్నారు. 12వ తేదీ విజయదశమి పురస్కరించుకుని మధ్యాహ్నం 12 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 6 గంటలకు శమీ వృక్షపూజ, అమ్మవారి ఉత్సవ మూర్తి నగర సంకీర్తన జరుగుతుందని వివరించారు. 13వ తేదీ ఆదివారం ఏకాదశి ఉదయం 9 గంటలకు శ్రీశివకామేశ్వరీ సమేత నీలకంఠేశ్వరస్వామి శాంతి కల్యాణం, మధ్యాహ్నం 12.30 గంటలకు అన్న ప్రసాద వితరణ, సాయంత్రం రథోత్సవం జరుగుతాయని తెలిపారు.

ఐకమత్యంతో జీవించాలి



నియామక పత్రం అందజేస్తున్న ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు నాగుల్‌మీరా

పాయకాపురం (విజయవాడరూరల్): హిందూ, ముస్లింలు సోదరభావంతో ఐకమత్యంగా జీవించాలని ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్ మీరా పేర్కొన్నారు. ఆదివారం 63వ డివిజన్‌లో సెంట్రల్ యూత్ అధ్యక్షుడు అన్వర్ బేగ్ ఆధ్వర్యంలో ఆజాద్ ముస్లిం కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాగుల్ మీరా మాట్లాడుతూ ప్రశాంత జీవనం గడపాలన్నారు. అనంతరం వాంబే కాలనీకి చెందిన షేక్ సలాంను ఆజాద్ ముస్లిం కమిటీ 60వ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా నియమించి నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆజాద్ ముస్లిం కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సాజీద్ అలీ, సెంట్రల్ అధ్యక్షుడు అన్వర్ బేగ్, సహాయ కార్యదర్శి సిలార్ బేగ్, 61వ డివిజన్ ప్రధాన కార్యదర్శి ఎండీ రఫీ తదితరులు పాల్గొన్నారు.

రాక్షస పాలన.. రౌడీ రాజ్యం

చంద్రబాబు వంద రోజుల పాలనపై మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాక్షస పాలన.. రౌడీల రాజ్యం నడుస్తోందని.. కూటమి ఎమ్మెల్యేల అరాచకాలు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ సీపీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు విమర్శించారు. సింగ్‌నగర్ ఆంధ్రప్రభ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. చంద్రబాబు అడుగడుగునా అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, అందుకే ప్రజా సమస్యలు పక్కదారి పట్టిస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని దుయ్యబట్టారు.

'సిట్' చంద్రబాబు బీ టీం

తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారంలో దర్యాప్తనకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'సిట్' చంద్రబాబు బీ టీం అని మల్లాది విష్ణు విమర్శించారు. కల్తీ జరగలేదని టీటీడీ ఈఓ స్పష్టంగా చెప్పారన్నారు. నిజంగా తప్పు జరిగిందని ప్రభుత్వం భావిస్తే సీబీఐ విచారణకు ఎందుకు భయపడుతున్నారని ప్రశ్నించారు. న్యాయవ్యవస్థపై తమకి అచెంచల విశ్వాసం ఉందని, అందుకే సుప్రీంకోర్టును ఆశ్రయించామని పేర్కొన్నారు.

ప్రజాప్రతినిధుల తీరు మారాలి

కూటమి ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలందరూ రౌడీలేనని.. రాష్ట్రంలో నడుస్తోంది ముమ్మాటికీ రౌడీ రాజ్యమేనని మల్లాది విష్ణు ఆరోపించారు. పోలీసులు కూడా వీరికి వత్తాసు పలకడం బాధాకరమన్నారు. రాష్ట్రంలో అనేక చోట్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయన్నారు. బాధితులకు ఎక్కడా న్యాయం జరగడం లేదని, తిరువూరు ఎమ్మెల్యే అరాచకాలే ఇందుకు నిదర్శనమన్నారు. మెడికల్ కాలేజీ హెచ్ఓడీపై కాకినాడ జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీ దాడి చేసి బూతులు తిడితే డెప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వంలో ఒక ఎమ్మెల్యే.. అంబేడ్కర్ బ్యానర్‌ని కాళ్లతో తొక్కి అవమానిస్తే, మరో ఎమ్మెల్యే తనకో రెడ్ బుక్ ఉందంటూ ప్రజలను భయపెడుతున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పోలీసులను సైతం బెదిరిస్తోందని, తాడిపత్రిలో ఓ సీఐ ఇంటి ముందు ధర్నా చేయడం ఇందుకు నిదర్శనమన్నారు. కాపు యువతను కార్మికశాఖ మంత్రి పోలీస్‌స్టేషన్ లో పెట్టించి కొట్టించిన ఘటన బాధించిందన్నారు. నంద్యాల మునిసిపల్ కమిషనర్‌పై సాక్షాత్తూ ఆ జిల్లా మంత్రినే దౌర్జన్యం చేయడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు.

వరద బాధితులపై లాఠీచార్జా!

విజయవాడ వరద ముంపునకు కారకులు కూటమి ప్రభుత్వ పాలకులేనని, ఆపన్న హస్తం అందించాల్సిన ప్రభుత్వం 'పశ్చిమ'లో ఎన్యూమరేషన్ జరగలేదని రోడ్డెక్కిన బాధితులపై లాఠీచార్జి చేయించడం దుర్మార్గమని మల్లాది విష్ణు ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రజలు ప్రభుత్వంపై తీవ్ర అసహనంతో ఉన్నారని.. వారంతా మీ మక్కెలు విరిచే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు.

మహాకవి జాషువా అందరికీ ఆదర్శం



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి రమాదేవి, విద్యార్థులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మహాకవి గుర్రం జాషువాను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గ్రంథాలయాధికారి కె.రమాదేవి సూచించారు. ఎంజీ రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం, గుర్రం జాషువా జయంతి కార్యక్రమం జరిగింది. జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ సామాజిక పరిస్థితులపై జాషువా గొప్ప రచనలు చేశారన్నారు. ఆయన రచించిన గబ్బిలం, ఫిరదౌసి పేరు ప్రఖ్యాతులు తెచ్చాయన్నారు. జాషువా రచనలు విద్యార్థులకు పాఠ్యాంశాలుగా చేర్చారని తెలిపారు. ఆయన రచనలు చదివి అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరాటే పోటీల బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

విజయవాడస్పోర్ట్స్: మేకల విజయసారథి మెమోరియల్ రెండో జాతీయ కరాటే పోటీల బ్రోచర్‌ను విజయవాడలోని ఓ ప్రైవేటు హోటల్‌లో ఆంధ్రప్రదేశ్ వడోక్కై కరాటే డో అసోసియేషన్ ప్రతినిధులు ఆదివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా శాస్త్రవేత్త మేకల లక్ష్మీప్రసాద్ విచ్చేశారు. విశాఖపట్నంలో డిసెంబర్ 15 నుంచి పోటీలు ప్రారంభమవుతాయని సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కోలా ప్రతాప్, జి.ఆనందబాబు తెలిపారు. పోటీలకు ఆర్గనైజింగ్ సెక్రటరీగా సీహెచ్ సతీష్ వ్యవరిస్తారని తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల క్రీడాకారులు పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని వెల్లడించారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు



సిద్ధార్థ ఆర్ట్ కాలేజీలో నృత్య ప్రదర్శన

విజయవాడ కల్చరల్: జేఎంఎస్ నాట్యవేద వార్షికోత్సవం సందర్భంగా మొగల్రాజపురంలోని పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నాట్యాచార్యులు జంగం సిస్టర్స్ పర్యవేక్షణలో చిన్నారులు పలు సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించారు. సంప్రదాయ కీర్తనల్లో భాగంగా చలమేల, సతులారా చూడరే, చక్కని తల్లికి చాంగుభళా, ఇదిగో భద్రాద్రి తదితర కీర్తనలను ఆలపించారు. ముఖ్యఅతిథి ఆధ్యాత్మిక వేత్త వేముల హజరత్తయ్య గుప్తా మాట్లాడుతూ ప్రేక్షక ఆదరణ ఉన్నప్పుడే కళారూపాలు జీవం పోసుకుంటాయని వివరించారు. చిన్నారులను నృత్యకళాకారులుగా తీర్చిదిద్దుతున్న జంగం మనీషా చక్రవర్తి, శిరీషా చక్రవర్తి కృషిని అభినందించారు. కార్యక్రమంలో విజయవాడ ఆకాశవాణి కేంద్రం అధికారులు వేంకటేశ్వర్లు, వెంపటి శ్రీ సాయి.ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ కమ్ముల శేషుకుమార్ పాల్గొన్నారు. నిర్వాహకులు జంగం విజయకుమార్, జంగం చక్రవర్తిలు చిన్నాలకు జ్ఞాపికలను అందజేశారు.

• చురుగ్గా దసరా ఏర్పాట్లు





ఇంద్రకీలాద్రిపై వచ్చే నెల 3 నుంచి శరన్నవరాత్రులు ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు చురుగ్గా ఏర్పాట్లు జరుగుతున్నాయి. వినాయకుడి గుడి నుంచి క్యూలైన్లు ఏర్పాట్లు చేశారు. భక్తులు సేదదీరడానికి చలువపందిళ్లు సిద్ధం చేస్తున్నారు. ఇంద్రకీలాద్రి వద్ద రక్షణగా ఇనుపమెష్ ఏర్పాటు చేశారు. కనకదుర్గనగర్‌లో అవసరమైన ఏర్పాట్లను సిబ్బంది చేస్తున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ